నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | శనివారం 13 ఏప్రిల్ 2024 | WARANGAL HANUMAKONDA



హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిత్రంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కావ్య

# కావ్యపై వ్యతిరేకత వాస్తవమే

**అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలి.. రుణమాఫీకి ఏడాది సమయం కావాలి**

**ఇప్పుడే ఇస్తామని మేమెక్కడా చెప్పలేదు.. సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 12 : వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యపై పార్టీలో వ్యతిరేక ఉన్నదనే విషయాన్ని వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అంగీకరించారు. ప్రతి రాజకీయ పార్టీ ప్రారంభంలో కొంత వ్యతిరేకత ఉంటుందని అన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు, ఎంపీ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి శుక్రవారం ఆయన హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కడియం కావ్య ఎస్సీ కాదని అరూరి రమేశ్ మాట్లాడడం సరైనది కాదని.. ఓడిపోతానని తెలిసి కులాన్ని బయటకు తీసుకొస్తున్నారంటూ రేవూరి మండిపడ్డారు. అరూరి రమేశ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని కావ్య ఆంధ్రా అమ్మాయి అని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 'డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పలేదు. రుణమాఫీ చేయడానికి మాకు సంవత్సరం టైం కావాలి. రెండు లక్షల రుణ మాఫీ విషయంలో ఏం చెప్పామో మీరే చూసుకోండి. మేము ఎక్కడా 100 రోజుల్లో రుణ మాఫీ చేస్తామని చెప్పలేదు. రుణ మాఫీ చేయడానికి సంవత్సరం టైం కావాలి' అని వివరించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి రుణమాఫీపై చేసిన వ్యాఖ్యలతో విలేకరుల సమావేశంలో ఉన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రుణమాఫీకి ఏడాది పడుతుందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'నా వల్ల ఎదిగిన రమేశ్ నాకే వెన్నుపోటు పొడిచాడు, రాజ్యాంగం, చట్టాలపై అవగాహన లేని అరూరి రమేశ్ 10 సంవత్సరాల్లో వరంగల్ జిల్లాకు మోదీ చేసిందేమీ లేక వ్యక్తిగత విషయాలపై మాట్లాడుతున్నాడ'ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం కావ్య వరంగల్‌లోనే పుట్టింది.. పెరిగింది.. చదువుకున్నది.. ఉద్యోగం చేస్తున్నదని ఎస్సీ కాదని నీచమైన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. టీడీపీలో సామాన్య కార్యకర్తగా ఉన్న రమేశ్‌కు జగిత్యాల ఎస్సారెస్పీ కాల్వ కాంట్రాక్ట్ పనులు తానే ఇప్పించానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెప్పారు.

# సెలైన్ బాటిల్‌లో నాచు..

**దంతాలపల్లి ప్రభుత్వ దవాఖానలో వెలుగులోకి..**

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

దంతాలపల్లి, ఏప్రిల్ 12: సెలైన్ బాటిల్‌లో నాచు వచ్చిన ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం వెలుగు చూసింది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన నర్కుటి సునీత గర్భిణి. కడుపునొప్పి రావడంతో ఈనెల 5న దంతాలపల్లి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లింది. ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో దవాఖాన సిబ్బంది సునీతకు రెండు సెలైన్ బాటిళ్లు, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో వైద్యశాల నుంచి తీసుకొచ్చిన సెలైన్ బాటిళ్లను పెట్టించేందుకు శుక్రవారం స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. వాటిలో ఒక సెలైన్ బాటిల్ బాగానే ఉండగా, మరో బాటిల్ (ఆర్ఎల్)లో నాచు ఉండడంతో అవాక్కయ్యారు. నిర్లక్ష్యంగా వ్యహరించిన ప్రభుత్వ దవాఖాన వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



నాచుతో ఉన్న సెలైన్ బాటిల్



## గెలుపు వ్యూహం

వరంగల్ లోక్‌సభ ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపునకు అనుసరించే వ్యూహంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతలతో శుక్రవారం చర్చించారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీకి పట్టున్న వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో గెలుపునకు పూర్తి సానుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్నదని, ముఖ్యంగా రైతులు అసంతృప్తిగా ఉన్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్ సమావేశంలో పాల్గొన్నారు.

# ఉద్యమకారుడికి ఛాన్స్

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం
- తెలంగాణ ఉద్యమకారుల హర్షం
- ఎంపీ స్థానం గెలుపుపై ముఖ్యనేతల భేటీ
- ఎన్నికల వ్యూహంపై కేసీఆర్ మార్గదర్శనం

**వరంగల్ ఎంపీ అభ్యర్థిగా సుధీర్‌కుమార్**

*ఉద్యమకారులకు అన్నింటా గుర్తింపునిస్తున్న బీఆర్ఎస్.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి, పార్టీకి విధేయుడిగా ఉన్న మారెపల్లి సుధీర్‌కుమార్‌కు వరంగల్ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. ఈమేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్యులతో చర్చించి, వారి ఏకగ్రీవ ఆమోదంతో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పట్టున్న వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో విజయావకాశాలు సానుకూలంగా ఉన్నాయని, అందరూ సమన్వయంతో పనిచేసి ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేయాలంటూ కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.*

*– వరంగల్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

భారత రాష్ట్ర సమితి మరోసారి తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇచ్చింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సుధీర్ తెలంగాణ సాధన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. మలిదశ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంట నడిచారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన సుధీర్‌కుమార్ మొదటినుంచీ బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్నారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడిగా, కేసీఆర్‌తో కలిసి పనిచేస్తున్న సుధీర్‌కుమార్ సరైన అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ ముఖ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈమేరకు అందరితో చర్చించి వారి సలహా, సూచనల మేరకు అధినేత కేసీఆర్, సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రకటించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్‌ను ఎంపిక చేయడంపై తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో మొదటినుంచీ కీలకంగా ఉన్న సుధీర్‌కుమార్ ఉమ్మడి కరీంనగర్ జడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చెందిన సుధీర్‌కుమార్ జిల్లాల పునర్విభజనలో హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చారు. ఎల్కతుర్తి జడ్పీటీసీగా గెలిచి జడ్పీ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



**వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ బయోడేటా**

పేరు : మారెపల్లి సుధీర్‌కుమార్
తండ్రి : మారెపల్లి జాన్, తల్లి : కిరీటమ్మ
భార్య : శోభారాణి, మెడికల్ ఆఫీసర్, గోపాల్‌పూర్, ఎల్కతుర్తి మండలం
కుమారుడు : సుజన్‌కుమార్ (బీటెక్)
కుమార్తె : సుకీర్తి (అసిస్టెంట్ సివిల్ సర్జన్, జమ్మికుంట)
కులం : ఎస్సీ(మాదిగ)
పుట్టిన తేదీ : 30-08-1962, జన్మస్థలం : హనుమకొండ
విద్యార్హతలు : ఇంటర్మీడియట్ – ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమకొండ
డిగ్రీ : కాకతీయ డిగ్రీ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ
బీఏఎంఎస్ : కాకతీయ యూనివర్సిటీ, వరంగల్
ఎండీ : (యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్)
నివాసం : ముల్కనూరు, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ జిల్లా

**రాజకీయ అనుభవం..**

- 27-04-2001 టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యత్వం
- 1995-2000 మండల పరిషత్ అధ్యక్షుడు, భీమదేవరపల్లి
- 2001-2006 ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు
- ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్..

**ఉద్యమ నేపథ్యం**

**మూడు పర్యాయాలు జైలుకెళ్లారు..**

1) ఆనాటి హుస్నాబాద్ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఇంటి ముట్టడి చేసినప్పుడు రెండు రోజులు జైలుకెళ్లారు..
2) ముల్కనూర్‌కు ఆనాటి రాష్ట్ర మంత్రి శిల్పామోహన్‌రెడ్డి సందర్శనను అడ్డుకున్నందుకు మూడు రోజులు జైలు
3) దండేపల్లిలో రైల్‌రోకోలో పాల్గొన్నందుకు మూడు రోజులు జైలుకు వెళ్లారు..

ఇవేకాక అనేక సార్లు ఉద్యమంలో పోలీసులు అరెస్టు చేశారు. బైండోవర్లు చేశారు.



వ్యవసాయ బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న నామాలపాడు గ్రామస్తులు

# నీళ్ల కోసం మైళ్ల దూరం

**నామాలపాడులో పదేళ్ల తర్వాత మళ్లీ నీటి కటకట**

**నిలిచిన మిషన్ భగీరథ, పనిచేయని బోరు**

**సరఫరా లేక గ్రామస్తుల ఇబ్బందులు**

**పరిసర ప్రాంతాలు, వాగులకు వెళ్లి తెచ్చుకుంటున్న ప్రజలు**

**ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం**

బయ్యారం, ఏప్రిల్ 12: తాగునీటి కోసం బయ్యారం మండలం నామాలపాడు ప్రజలు అరిగోస పడుతున్నారు. గ్రామంలో సుమారు 120 ఇండ్లు ఉండగా, 350 జనాభా ఉంది. కొద్ది రోజులుగా గ్రామానికి తాగునీటి సరఫరా సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి భూమి పొరల్లో బొగ్గు నిల్వలు ఉన్నాయి. దీంతో బోర్లు వేసినా నీరు సరిగా పడవు. పడినా ఆ నీరు సమరు, చిలుము వాసనతో ఉంటాయి. ఈ నీరు ప్రజలు అవసరాలకు ఉపయోగించేలా ఉండవు. దీంతో మిషన్ భగీరథ నీరు గానీ, గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో జిన్నాలవాగు వద్ద బోరు వేసి గ్రామానికి పైపులైన్ ద్వారా నీరు సరఫరా అయ్యేది. ఈ నీటిని ఇన్నాళ్లుగా తాగునీరు, వివిధ అవసరాలకు ఉపయోగించుకునేవారు. కానీ కొద్ది రోజులుగా నీటి సరఫరా సరిగా లేక ప్రజలు నరకయాతన పడుతున్నారు. భూగర్భ జలాలు తగ్గడంతో గ్రామ శివారులోని బోరులో నీటి లభ్యత పూర్తిగా లేదు. ఈ క్రమంలోనే మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. దీంతో స్థానికులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఊరు పక్కనున్న వాగుల్లో కొందరు కలుషిత నీటినే తాగునీటి కోసం ఉపయోగిస్తున్నారు. మరికొందరు పక్కనున్న కొత్తపేట, గంధంపల్లికి వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గంధంపల్లి, కొత్తపేట గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి సరఫరా చేస్తున్నా అవి సరిపోక మహిళలు నీటి కోసం బిందెలు, క్యాన్లతో సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. సమీప వాగులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి స్నానాలు చేసి, అక్కడే బట్టలు ఉతుక్కుంటున్నారు. నీటి కొరత వచ్చినప్పుడు అధికారులు హడావుడిగా తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత పరిష్కారాన్ని ఆలోచించడంలేదు. పైగా ఈసారి వేసవి దృష్ట్యా ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రస్తుతం తాము నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటిసమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు

**పదేళ్ల తర్వాత నీటి కటకట**

నామాలపాడులో నీటి కటకట పదేళ్ల తర్వాత పునరావృతమైంది. అప్పట్లో నీటి కోసం ఇక్కడి ప్రజలు వాగులు, ఊట చెలిమలు, వ్యవసాయబావుల వద్ద వెళ్లి తెచ్చుకునేవారు. ఈ క్రమంలోనే కలుషిత నీరు తాగి గ్రామానికి చెందిన వృద్ధుడు పోశాలు, యువతి శ్రావణి మృతిచెందింది. దీంతో అప్పటి కలెక్టర్ ప్రీతి మీనా గ్రామాన్ని సందర్శించి నీటి సమస్య పరిష్కారం కోసం రూ.10లక్షల నిధులు కేటాయించి జిన్నాల వాగు వద్ద బోరు వేయించి పైపులైన్ ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేశారు. గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించారు. ఆతర్వాత మిషన్ భగీరథ రావటంతో తాగునీటి, బోరు ద్వారా సాధారణ నీరు అందుతున్నాయి. కొన్ని రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు దూర ప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.




నీటి కోసం ట్యాంకర్ల వద్ద జనం



బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న గ్రామస్తులు



**చాలా ఇబ్బంది పడుతున్నం**

తాగునీటి కోసం కొన్ని రోజులుగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. మిషన్ భగీరథ నీరు, బోరు నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవటం లేదు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. పోయినేడాది నీళ్లు మంచిగనే వచ్చాయి.

*– బుచ్చయ్య, నామాలపాడు*



**మా ఊరి నీళ్లు పనికి రావు..**

మా ఊరి భూమి పొరల్లో మొత్తం బొగ్గే ఉంది. బోరు వేసినా సరిగా నీరు పడదు. పడ్డా సమరు వాసన ఉంటాయి. పనికిరావు. అందుకే శివారులో బోరు వేసి పైపులైన్లతో గ్రామానికి పదేండ్లుగా నీటిని అందిస్తున్నారు. ఇప్పుడు బోరులో నీరు ఎండిపోయింది. కొద్ది రోజులుగా మస్తు తిప్పలు పడుతున్నం. ముందు ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందో!

*– వీరభద్రమ్మ, నామాలపాడు*



తమకు న్యాయం చేయాలంటూ గోడు వెల్లబోసుకుంటున్న రైతులు

# పంట డబ్బులు ఇప్పించండి

- 56 మందికి రూ.30లక్షలు రావాలంటున్న రైతులు
- మంత్రి సీతక్క పేరుతో బెదిరిస్తున్నారని ఆరోపణ
- న్యాయం చేయాలని వేడుకోలు

ములుగు, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి పైసా ఇవ్వకుండా ఓ వ్యాపారి రైతులను ఇబ్బంది పెడుతున్న ఘటన ములుగు మండలం శ్రీనగర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం బాధిత రైతులు 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించి తమ గోడు వెల్లబోసుకున్నారు. రైతులు అజ్మీరా హర్సింగ్, బిలావత్ భిక్షపతి, లాగు సాంబయ్య, అజ్మీరా వాక్య, గుగులోత్ రాజు, గుగులోత్ బీమా, భూక్యా భిక్షపతి, నక్క రవి, బిలావత్ మమత, తోట రాజేందర్, నల్లెల్ల రాజయ్య, రవి, కొత్తూరు మహేందర్, గుగులోత్ బీకు, కీయా, మున్నా, బిలావత్ అచ్చి, మాలోత్ మంజీలాల్, గుగులోత్ కొమ్మాలు, హతిరామ్ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల అంజనాపురం గ్రామానికి చెందిన వ్యాపారి నెమలపూరి శ్రీనివాస్ తమ గ్రామంలో ఉంటున్నాడని తెలిపారు. 2013లో వరి, మక్కజొన్న ఉత్పత్తులను సుమారు 56 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటిని అమ్మిన తర్వాత డబ్బులు ఇస్తానని చెప్పి తమకు రావాల్సిన రూ.30లక్షలు ఇవ్వకుండా కుటుంబంతో సహా ఉడాయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజుల తర్వాత అతడి భార్య మమత గ్రామానికి రాగా, డబ్బులు విషయమై నిలదీయంతో రెండున్నర ఎకరాల భూమిని ఇచ్చిందని తెలిపారు. తమ గ్రామంలో 40 ఎకరాల భూమి ఉన్న రిటైర్డ్ ఆర్టీవో రాజేశ్వర్‌రావు ఆ భూమిని కొనుగోలు చేసి, తమ డబ్బులు తమకు ఇచ్చి, మిగితా డబ్బులను శ్రీనివాస్ భార్య మమతకు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఆ సమయంలో రాజేశ్వర్‌రావు తమకు తలా రూ.2వేలు నుంచి రూ.3వేలు అప్పటి అవసరాల నిమిత్తం ఇచ్చినట్లు తెలిపారు. శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం గ్రామానికి వచ్చినా, అతడి మోసాన్ని దిగమింగుకొని అతడి భార్య ఇచ్చిన భూమినిలో పని చేసుకుంటూ వస్తున్నామన్నారు. గతేడాది రాజేశ్వర్‌రావు అనారోగ్యంతో మృతిచెందాడని అన్నారు. ఈ క్రమంలో శ్రీనివాస్ తాము అతడి భార్యను బెదిరించి భూమిని రాయించుకున్నామని గొడవ చేసి 2016లో తమలోని నలుగురిపై కేసులు పెట్టించాడని వాపోయారు. ప్రస్తుతం రాజేశ్వర్‌రావు మృతిచెందగా, అతడి కొడుకు వినయ్‌కుమార్‌తో శ్రీనివాస్ ఒప్పందం కుదుర్చొని గ్రామానికి చెందిన బిలావత్ దేశ్య, గుగులోత్ భిక్షపతి, తోట కుమారస్వామి, గుగులోత్ కిషన్‌తో కలిసి తమకు రాసి ఇచ్చిన భూమిని వాటాలుగా చేసుకుని పంచుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మంత్రి సీతక్క పేరు చెబుతూ దేశ్య బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 8న కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.